క్లుప్తంగా

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం


భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

పొదిలి: స్థానిక అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు ప్రతి బుధవారం అన్నదానం నిర్వహిస్తున్నారు. వేము శ్రీనివాసులు, అంజమ్మ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి అన్నదానం చేశారు. ముందుగా ఉభయదాతలు అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి మురళీచార్యులు, గురుస్వాములు యక్కలి శేషగిరిరావు, అప్పల శంకర్ రావు, పానుగుపాటి కోటేశ్వరరావు, గంజి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెళకువలు పాటించాలి


తువ్వపాడులో పంట సాగుపై రైతులకు సూచనలిస్తున్న ఏఓ

కొనకనమిట్ల: రైతులు వ్యవసాయంలో మెళకువలు పాటించి అధిక దిగుబడి పొందాలని ఏఓ ప్రసన్న రంగలక్ష్మి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని తువ్వపాడు, వెలిగండ్ల, మునగపాడు, చింతగుంట గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు వ్యవసాయంలో తీసుకోవాల్సిన రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. రైతులు పంటలు సాగుచేసే సమయంలో నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవాలన్నారు.

ఘనంగా బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

పొదిలి: అజరామర గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి స్నేహితుల బృందం ఆధ్వర్యంలో డాక్టర్ లక్ష్మీ నారాయణ క్లినిక్‌లో బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ బాలును ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదిగిన ఔత్సాహిక గాయకుల గురించి గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో చిన్ననాటి స్నేహితుల బృందం సభ్యులు షేక్.మహమ్మద్ రఫీ, అశోక్ బండి, షేక్.యాసిన్, షేక్.యస్దాన్(రోటీ), డాక్టర్ కె.లక్ష్మీనారాయణ, నీలకంఠం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థులు


కొనకనమిట్ల : ఎంపికైన బాలికలతో ప్రిన్సిపాల్, పీఈటీ

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు పలువురు జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సురేఖ, పీఈటీ వనజలత తెలిపారు. పోటీలకు ఎంపికైన నలుగురు విద్యార్థులు కందుల స్రవంతి, మైలమూరి శ్రావణి, ఆలమూరి అలేఖ్య, తన్నీరు సుధారాణిని అభినందించారు. ఈ సందర్భంగా పీఈటీ వనజలత మాట్లాడుతూ.. ఇటీవల మార్కాపురంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో తమ పాఠశాల క్రీడాకారులు జావెలిన్‌త్రో, రన్నింగ్, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, హై జంప్ పోటీల్లో ప్రతిభ కనబరిచారని వివరించారు.

పోషకాహారన్ని సద్వినియోగం చేసుకోవాలి


తిప్పాయపాలెంలో పోషకాహార వారోత్సవాల్లో పాల్గొన్న సీడీపీఓ, అంగన్‌వాడీ కార్యకర్తలు

మార్కాపురం రూరల్: మండలంలోని తిప్పాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ పరిధిలోని 25 మంది అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో బుధవారం పోషికాహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ పి.సుశీలాదేవి మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తయారు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పోషకాహారంతో వ్యాధి నిరోధకశక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా ఆకు కూరలు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.అరుణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చినుకులే చిన్నబోయేలా!


జలమయమైన కర్నూలు-ఒంగోలు ప్రధాన రహదారి


ఆర్టీసీ బస్టాండ్ వద్ద డ్రెయినేజీ దుస్థితి ఇదీ..

- పొదిలిలో అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ
- డ్రెయినేజీల నుంచి భరించలేని వాసన
- నీటి కాలువలా పట్టణ ప్రధాన రహదారి
- వర్షం కురిస్తే అవస్థలు పడుతున్న వాహనదారులు
- ఇరుకు దారులతో నిత్యం ట్రాఫిక్ సమస్య
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో డ్రెయిన్, డివైడర్ల నిర్మాణానికి రూ.11 కోట్లు మంజూరు
- ఆ నిధులతో పనులు చేపట్టాలని పొదిలి వాసుల వినతి

పొదిలి: వర్షం కురవాలని అందరూ కోరుకుంటారు. కానీ పొదిలి పట్టణ వాసులు మాత్రం వర్షం పడకూడదని వేడుకుంటున్నారు.! గట్టిగా నాలుగు జల్లులు కురిస్తే వర్షం నీరు రోడ్లను ముంచెత్తుతుండటమే అందుకు కారణం. పొదిలి పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా తయారవడంతో వర్షం నీరు ముందుకు కదిలే మార్గం లేకుండా పోయింది. మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీకి అప్‌గ్రేడ్ అయినప్పటికీ పొదిలిలో కనీస మౌలిక వసతులు ఇంకా పూర్తి స్థాయిలో కల్పించలేదు. ప్రధానంగా పట్టణంలో రోడ్డు మార్జిన్లు ఆక్రమణకు గురికావడం, సైడు కాలువలు లేకపోవటంతో ట్రాఫిక్, నీటి ముంపు సమస్య తీవ్రంగా ఉంది. తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో అటు వాహనదారులకు ఇటు పోలీసులకు తలనొప్పిగా మారింది. జిల్లా నడికూడలి కావడంతో వేలాది వాహనాలు పొదిలి మీదుగానే ప్రయాణిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం పోలీసులకు కూడా సవాల్‌గా మారింది.

దోమలు.. దుర్వాసన!

డ్రెయినేజీలు సక్రమంగా లేకపోవడం, కొన్నిచోట్ల కచ్చా కాలువలు ఉండటంతో వర్షం కురిసిన సమయంలో మురుగు మొత్తం రోడ్ల పైకి చేరుతోంది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద మురుగునీటి చెరువు ఏర్పడింది. రాకపోకలు సాగించే వారికి దుర్వాసన బాధ తప్పడం లేదు. మరో వైపు దోమలు విజృంభిస్తుండటంతో స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు.

గత ప్రభుత్వంలో రూ.11 కోట్లు మంజూరు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మార్కాపురం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి పొదిలిలో డ్రెయినేజీ, రోడ్లు, డివైడర్ ఏర్పాటుకు సహకరించాలని అప్పటి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరగా సానుకూలంగా స్పందించారు. తక్షణమే పొదిలి ప్రధాన రోడ్డు అభివృద్ధి, డివైడర్, సైడు కాలువల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ కోసం రూ.11 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు స్థానిక అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

పట్టణ వాసుల ఎదురు చూపులు

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో గతంలో అధికారులు పంపిన ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు. ఆ రూ.11 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తే మార్కాపురం అడ్డ రోడ్డు నుంచి కాటూరివారిపాలెం వరకు రోడ్డు అభివృద్ధి అయ్యే అవకాశం ఉంది. సైడు కాలువలు, డివైడర్ నిర్మించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో పొదిలి స్వరూపమే మారిపోతుందన్న ఆకాంక్ష స్థానికుల్లో బలంగా వ్యక్తమవుతోంది.

నీట మునిగిన కర్నూలు రోడ్డు

స్థానిక ఒంగోలు–కర్నూలు రాష్ట్రీయ రహదారి మంగళవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి కాలువలా మారిపోయింది. నీరు సక్రమంగా బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో వాహనదారులకు అవస్థలు తప్పలేదు. ప్రధానంగా స్థానిక ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు రోడ్డుపై నీరు భారీగా నిల్వ చేరింది.

ప్రతిపాదనలు పంపాం

రూ.11 కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపించి చాలా రోజులైంది. మళ్లీ అడిగితే పంపించేందుకు సిద్ధంగా ఉన్నాం. పట్టణంలోని ప్రధాన రహదారి దుస్థితికి ఆక్రమణలే కారణం. రెండు మూడు శాఖలు కలిసి సమన్వయంతో పనిచేసి, వచ్చే నిధులను ఉపయోగించుకుంటే సమస్య పరిష్కారం అవుతుంది.

– జి.కృష్ణ, డీఈ, ఆర్‌అండ్‌బీ

ఉత్తమ ప్రతిభకు ప్రశంస పత్రాలు పంపిణీ


పొదిలి : ప్రతిభ చాటిన బాలికలతో ఎంఈఓ, ఉపాధ్యాయులు


విద్యార్థులకు ప్రసంస పత్రం అందజేస్తున్న రాంభూపాల్‌రెడ్డి

పొదిలి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన బాలికలకు బుధవారం ప్రశంస పత్రాలు పంపిణీ చేశారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన బాలికలకు అభినందన సభ జరిగింది. పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థినులను సత్కరించారు. విశ్రాంత ఉపాధ్యాయులు, సంఘ సేవకుడు మార్కాపురం రామభూపాల్‌రెడ్డి వీరికి ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎం.శ్రీనివాసరెడ్డి, పి.నాగలక్ష్మి, స్పెషల్ ఆఫీసర్ అనూరాధ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రసంస పత్రాలు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గత ఏడాది టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బుధవారం రిటైర్డ్ హెచ్‌ఎం రాంభూపాల్‌రెడ్డి జ్ఞాపికలు, ప్రసంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ–2 నరసింహారావు మాట్లాడారు. నియోజకవర్గంలో పేద విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు తోడ్పాటునందిస్తున్న రాంభూపాల్‌రెడ్డి కృషిని అభినందించారు. హెచ్‌ఎంగా రిటైర్డ్ అయినప్పటికి స్వచ్ఛందంగా జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, గురుకుల పాఠశాలల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించడంతో పాటు పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారని కొనియాడారు. దాతల సహకారంతో విద్యార్థులు చదువులో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం రాంభూపాల్‌రెడ్డిని ఎంఈఓ నరసింహారావు, ప్రిన్సిపాల్ సురేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించాలి


కొమరోలులో చెకుముకి పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కొనకనమిట్ల: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సంబరాలు నిర్వహించారు. మర్రిపాలెం, గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, గొట్లగట్టు కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై పాఠశాల స్థాయిలో టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గొట్లగట్టు కేజీబీవీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ–2 నరసింహారావు పాల్గొని విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నాగేశ్వరరావు, విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ సురేఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిచుకునేందుకు ప్రయత్నించాలని జేవీవీ రాష్ట్ర నాయకుడు పి.స్వరూపారెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని పాదలకుంటపల్లె గ్రామంలో బుధవారం చెకుముకి సైన్స్ సంబరాల ప్రశ్నాపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్‌లు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.రామసుబ్బారెడ్డి, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ నాయకుడు రామిరెడ్డి, జేవీవీ నాయకులు పాల్గొన్నారు.

కొమరోలు: విద్యార్థులు సైన్స్‌కు సంబంధించిన విషయాలు తెలుసుకుంటూ శాస్త్రీయ వైఖరి పెంపొందించుకోవాలని జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు అబ్బూరి అల్లూరయ్య తెలిపారు. జేవీవీ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.అశ్వనికుమార్ చెకుముకి ప్రశ్నపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో మండలంలోని 8, 9, 10వ తరగతి విద్యార్థులు 620 మంది పరీక్ష రాసినట్లు హెచ్‌ఎం తెలిపారు.

మార్కాపురం టౌన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్లను అరవింద విద్యా కేంద్రంలో బుధవారం జేవీవీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ శరత్, పాఠశాల ప్రిన్సిపాల్ సి.వాణి మాట్లాడుతూ చెకుముకి టాలెంట్ టెస్టులో వెయ్యి మంది విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. మూఢ నమ్మకాలు విడనాడి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు రవికుమార్, శివ, నారాయణరెడ్డి, మల్లికార్జున, బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు రమాదేవి, రుక్సానా, నారాయణ స్కూల్లో ప్రిన్సిపాల్ కిశోర్, శశిధర్, కమలా స్కూల్లో హెచ్‌ఎం పుల్లయ్య, రామాంజనేయులు, సాయిబాబాతో పాటు వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థు పాల్గొన్నారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

కంభం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చెకుముకి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రశ్నపత్రాలను ఎంఈఓ మాల్యాద్రి విడుదల చేశారు. కార్యక్రమంలో రమణారెడ్డి, వరికుంట్ల వెంకటేశ్వర్లు, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అద్భుతాలు


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న నాగరాజు

మార్కాపురం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అద్భుతాలు సాధించవచ్చని ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్, డైరెక్టర్ మసూద్ ఆలీ బేగ్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై టెక్నాలజీ లీడర్ ఐఐటీ కోల్‌కతాకు చెందిన నాగరాజు మాట్లాడుతూ జి.నాగరాజు ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకుంటూ సృజనాత్మకతతో ముందుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు. ఏఐతో భవిష్యత్తులో అద్భుతాలు సృష్టించవచ్చని, దీనిపై విద్యార్థులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీధర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌కె మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు


ఎస్‌ఐ రాజ్‌కుమార్‌ను సన్మాణిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొనకనమిట్ల: మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన టి.రాజ్‌కుమార్‌ను బుధవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, సొసైటీ మాజీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఉన్నం శ్రీనివాసులు, గొట్లగట్టు ఉప సర్పంచ్ గాడి కోనేటిరెడ్డి, గనివానిపాడు సర్పంచ్ పాలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు, నాయకులు కుందురు గురుస్వామిరెడ్డి తదితరులు ఎస్సైని కలిసి శాంతి భద్రతలను కాపాడాలని కోరారు.

అటవీశాఖ డీడీ బదిలీ

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ వైవీ నరసింహారావును ప్రభుత్వం చింతపల్లి అటవీశాఖకు బదిలీ చేసింది. గత రెండు సంవత్సరాల నుంచి గిద్దలూరు అటవీశాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా స్థాన చలనం పొందారు.

మానసిక దివ్యాంగుల పాఠశాలకు చేయూత


చిన్నారులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న సభ్యులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల రోడ్డులో మానసిక దివ్యాంగుల పాఠశాలకు ప్రజా సంకల్ప వేదిక అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు ఓ.వెంకటయ్యయాదవ్ బుధవారం రూ.10 వేల విలువైన నిత్యావసర వస్తువులతో పాటు ఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంకల్ప వేదిక నిర్వాహకులు ఎ.నాగమణి, మాజీ సైనికుల విభాగం అధ్యక్షుడు బి.ఓబులేసు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రాజయ్య, సభ్యులు మాబున్నీ, కె.కోటిలింగం, బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఖర్చు తగ్గించుకుని
అధిక దిగుబడి పొందాలి

- ఏడీఏ బాలాజీ నాయక్


కొమరోలు: రైతులకు సూచనలిస్తున్న ఏఓ


మార్కాపురం : రైతులకు సూచనలిస్తున్న ఏఓ శ్రీనివాసరెడ్డి

పొదిలి రూరల్: రైతులు సాగు ఖర్చు తగ్గించుకుని అధిక దిగుబడి పొందాలని దర్శి వ్యవసాయ సంచాలకుడు కె.బాలాజీ నాయక్ పేర్కొన్నారు. బుధవారం పొదిలి మండలంలోని ఆముదాలపల్లి, తలమళ్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది గ్రామ సభలు నిర్వహించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. రైతులు కేవలం రసాయన ఎరువులు, పురుగు మందులపై ఆధారపడకుండా పంటలో సాగు ఖర్చు పెంచుకుంటున్నారని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతులు అవలంబించాలని సూచించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల పరిధిలో అమలు చేస్తున్న పథకాల గురించి రైతులకు వివరించారు. వ్యవసాయాధికారి జైనులాబ్దిన్ మాట్లాడుతూ.. రైతులందరూ పంట నమోదు, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. పశువులకు గడ్డి గింజలు, దాణా, టీకాల గురించి వివరించారు. కార్యక్రమంలోమార్కెటింగ్ శాఖ అధికారి రవీంద్ర, ఉన్నగురువాయపాలెం పశు వైద్యాధికారి డాక్టర్ మంచికల మణిశేఖర్, రైతులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణలు పాటించాలి

మార్కాపురం రూరల్: వరి పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలని మార్కాపురం ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు సూచించారు. మార్కాపురం మండలంలోని పెద్దనాగులవరం, నికరంపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరి పొలాలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ ముందుగా నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ముదురు నారు నాటితే దిగుబడి తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో పెద్దనాగులవరం, నికరంపల్లి రైతుసేవా కేంద్రం సిబ్బంది నవ్య, గణేష్, రైతులు పాల్గొన్నారు.

కొమరోలు: సమగ్ర యాజమాన్య పద్ధతిలో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని కొమరోలు ఏఓ రాజశ్రీ తెలిపారు. మండలంలోని హనుమంతరాయునిపల్లె, ఇడమకల్లు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యానశాఖాధికారి విష్ణుప్రియ, పట్టుపరిశ్రమశాఖ సాంకేతిక సహాయకులు పాండురంగారెడ్డి, వీఏఏ రవిచంద్రరెడ్డి పాల్గొన్నారు.

తర్లుపాడు: మండల కేంద్రం తర్లుపాడుతోపాటు చెన్నారెడ్డిపల్లి, నాగెళ్లముడుపు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది, మిరప, వరి పొలాలను ఏఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు. సేంద్రియ ఎరువులు వాడి పెట్టుబడులు తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. పశువైద్యాధికారి నందన, మైక్రో ఇరిగేషన్ అధికారి ఓబయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన కార్యదర్శి


సభ్యత్వ రసీదులు పంపిణీ చేస్తున్న కార్యదర్శి ఆదిలక్ష్మి

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. ఒంగోలుకు చెందిన రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య అందించిన ఆర్థిక సహకారంతో పది మంది విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వం ఇప్పించారు. సభ్యత్వ రసీదులను గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు గురుస్వామి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: విద్యార్థులు గ్రంథాలయాలపై ఆసక్తి చూపాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. పట్టణంలోని గ్రంథాలయాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో రికార్డులు పరిశీలించారు. అనంతరం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. విజ్ఞానాన్ని పెంపొందింకునేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని ఆదిలక్ష్మి పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, గ్రంథపాలకురాలు ప్రసన్న కుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.నాగభూషణ్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంభం: లైబ్రరీ సెస్ బకాయిలు వసూలు చేయడంపై సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి సూచించారు. పట్టణంలోని గ్రంథాలయాన్ని బుధవారం ఆమె తనిఖీ చేసారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య విద్యార్థులకు మెంబర్‌షిప్ అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు వెంకటేశ్వర్లు, రావిపాడు ఈడీసీఎల్ నిర్వాహకుడు మల్లికార్జునాచారి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించుకోకుంటే రద్దు


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నారాయణరెడ్డి

బేస్తవారిపేట: ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో మంజూరైన గృహాలు సకాలంలో పూర్తి చేయకపోతే రద్దవుతుందని మండల ప్రత్యేకాధికారి నారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాల్లో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 2025 మార్చి నాటికి గృహాలు పూర్తి చేసుకోలేకపోతే పథకం రద్దవుతుందని స్పష్టం చేశారు. మార్చి తర్వాత నిర్మాణాలు చేపట్టిన బిల్లులు మంజూరు కావని తెలిపారు. మండలంలోని లేఔట్లు, గృహాల కట్టడాలు ఏ దశలో ఉన్నాయో హౌసింగ్‌శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్రకుమార్, ఏపీఓ గురువరకుమార్, హౌసింగ్ ఏఈ పోలయ్య, ఈఓపీఆర్డీ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టులు కీలకం


డాక్టర్ శ్రీకాంత్, సునీత దంపతులను సన్మానిస్తున్న బీసీ సంఘ నాయకులు

మార్కాపురం టౌన్: ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని జాతీయ బీసీ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం బీసీ భవన్‌లో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా ఫార్మసిలో డాక్టరేట్ పొందిన డాక్టర్ శ్రీకాంత్, సునీత దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ నాయకులు రంగస్వామిగౌడ్, సుబ్బారావు, పురుషోత్తం, వంకేశ్వరం శ్రీనివాస్, చక్రపాణి, నరసింహారావు, ఆదాం సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ ప్రతిపాదిత స్థలం పరిశీలన


భూమిని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని పోతవరం సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు రెవెన్యూ శాఖ ప్రతిపాదించిన భూమిని బుధవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పరిశీలించారు. రికార్డులతో పాటు, భూమిని పరిశీలించి పలు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 172–1లో 1.50 ఎకరాల భూమిని ఫైర్ స్టేషన్ ఏర్పాటు నిమిత్తం ప్రతిపాదించినట్లు తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి వివరించారు. కనిగిరి ఆర్డీఓ జాన్ ఇర్విన్, ఫైర్ అధికారులు, ఇన్‌చార్జ్ ఆర్ఐ కె.సుబ్బారావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

వర్షంతో రహదారులు జలమయం


గొట్లగట్టు బస్టాండ్ సెంటర్‌లో నిలిచిన నీరు

కొనకనమిట్ల: మండలంలో రెండు రోజులపాటు కురిసిన వర్షానికి భూములు పదునెక్కాయి. మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో మినుము, అలసంద, మిర్చి, పొగాకు, కూరగాయల పంటలు సాగు చేయడానికి అవకాశం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. రాత్రి కురిసిన వర్షానికి గొట్లగట్టు బస్టాండ్ సెంటర్ సచివాయలం వద్ద, వెంగళపల్లి బీసీ కాలనీకి వెళ్లే రహదారి జలమయమయ్యాయి.